**జ్ఞానమూర్తి తను కట్టుకొచ్చిన సీరుకావిరంగు ధోవతిని, బూడిద రంగు పొట్టి చేతుల చొక్కానూ ఓ చిలక్కొయ్యకు తగిలించి, తన కూడా సంచీలో పెట్టి రహస్యంగా తీసుకువచ్చిన బెల్ బాటమ్ ప్యాంటునూ గురూ షర్టునూ ఒంటికేసుకున్నాడు.**

విలాసంగా మెడచుట్టూ మఫ్లర్ చుట్టుకుని పైకి కొనతేలిన ముక్కుమీద కళ్ళజోడు సర్దుకుని. ఫ్రెంచి కట్ మీసాన్ని మరోసారి చేత్తో సవరించుకుని. యాంటీ రూంలో నుంచి ప్లేయర్స్ హాల్లోకి చిరునవ్వుతో అడుగెట్టాడు.

"ఏం మార్చావు గురూ. వేషం!.. మీ అన్నయ్య చూసినా సరే. ఇప్పుడు నిన్ను గుర్తుపట్టలేడు." సత్యానంద్ ముక్కలు కలుపుతూ అన్నాడు.

ఫ్రీ ఫైవ్ కాలుస్తూ జోకర్ పడుతుందా లేదా అని ఆలోచిస్తున్న నరేంద్రనాథ్ ఆ మాట విని "వాళ్ళన్నయ్యే కాదు. వాళ్ళావిడ చూసినా సరే ఇప్పుడు గుర్తుపట్టలేదు. బెట్" అన్నాడు.


"ఆడవాళ్ళ సంగతి చెప్పకు బ్రదర్! వాళ్ళవి గద్దకళ్ళు. మొగుడుకాల్తే ఎన్ని వేషాలు మార్చినా వాళ్ళిట్టే పట్టేస్తారు" గున్నయ్యచెట్టి గొణిగాడు.

జ్ఞానమూర్తి టేబిలుదగ్గరకువచ్చికూర్చున్నాడు. కాయిన్స్ ముందుపెట్టుకున్నాడు. వాళ్ళ మాటలను కేర్ చెయ్యనట్టుగా "పంచు గురూ తొందరగా. బ్యాంక్ రావడమో పోవడమో తేలిపోవాలి" అన్నాడు. ముక్కలు పంచాడు సత్యానంద్. ఆట ఒక్కోసారి కలుస్తోంది. ఒక్కోసారి పోతోంది. కలిసినవాడు కాఫీలు తెప్పిస్తున్నాడుపోయినవాడుఏడవలేక. వెలిసిపోయిన నవ్వురంగు పెదాల మీదకు పూసుకుంటున్నాడు. అవతలివాడు డీల్ కొట్టినా. తను ఆల్ కౌంట్ ఇచ్చినా. జ్ఞానమూర్తి మాత్రం నిశ్చలంగా తన ఆట తను ఆడుకొంటున్నాడు. అతని ముందు కాయిన్స్ గుట్ట పెరుగుతోంది.

"ఎందుకు గురూ అంత సీరియస్‌నెస్— బ్యాంకు వస్తే ఎంత. పోతే ఎంత?" నరేంద్రనాథ్ అన్నాడు వ్యంగ్య కంఠంతో

"వస్తే వొంద. పోతే వంద!" జ్ఞానమూర్తి నెమ్మదిగా అన్నాడు.

"వారానికోసారి వస్తావు. వంద ఇయ్యడమో తీసుకోడమో చేస్తావు. వందకుమించి ఆడవు. వచ్చేటప్పుడు ధోవతి కట్టుకుని వస్తావు. లోపలకు రాగానే ప్యాంటులోకి మారతావు. ఎందుకు గురూ ఈ మేకప్ అంటే మా అన్నయ్యొచ్చినా సరే నన్ను గుర్తు పట్టకుండా ఉండటానికి అంటావు. నీదంతా ఓ మిస్టరీ స్టోరీలా ఉందే!" అన్నాడు గున్నయ్య చెట్టి కూపీ లాగటానికి ప్రయత్నిస్తున్న ధోరణి బయట పడకుండా. ప్లేయర్స్ హాల్లో హడావిడి అంతకంతకూ ఎక్కువౌతోంది. నలుగురాడే టేబిల్స్ దగ్గర ఆరుగురు కూచుంటున్నారు. ఆటగాళ్ళు పీల్చి వదిలే సిగరెట్ల పొగ అగర్ బత్తీల పరిమళాన్ని ఔపోశన పడుతోంది. జూక్ బాక్స్‌లోంచి సంగీతం రూపంలో సెక్స్ మత్తు వంచబడుతోంది.




గోడల మీద ఎనిమిదేళ్ళ ఓ ఆడపిల్ల గౌను అంచుల్ని ఎత్తిపట్టుకుని గౌనులోపలికి తొంగి చూసే ఆరేళ్ళ మగవెధవ బొమ్మ. ఓ నగ్నసుందరి కట్‌డ్రాయర్ని వెనకనుంచి లాగేస్తున్న కుక్కపిల్ల బొమ్మ. మారిపోతున్న ఇండియన్ కల్చర్‌కు గుర్తులుగా ఉన్నాయి.

జ్ఞానమూర్తి ఆ హాల్లోవున్నవారివేపు బర్డ్స్ ఐవ్యూగా చూశాడు. కళ్ళల్లో ఓ విషాద రేఖ.

"నరేన్—ఓ సిగరెట్టందుకో!"

"నువ్వు....నువ్వు .... సిగరెట్టు కాలుస్తావా?" ముగ్గురిలోనూ ఆశ్చర్యం.

పొగ లోపలకుపోయి జ్ఞానమూర్తి ఉక్కిరిబిక్కిరయ్యాడు. "ఓహో. ఇవ్వాళే నేమిటి ఇనాగరేషన్?" అన్న వాళ్ళ ప్రశ్నకు అవునన్నట్టుగా తలూపాడు.

"మిస్టరీ మరింత ఎక్కువౌతోంది మూర్తీ!" మళ్ళీ అన్నాడు గున్నయ్యచెట్టి. సమాధానంగా జ్ఞానమూర్తి కళ్ళు మూసుకున్నాడు. "ఇందులో మిస్టరీ ఏం లేదు. నా కథ. ఈ దేశంలో ఒక సామాన్యుడి కథ. అనుక్షణం డబ్బుకోసం తపనపడే దిగువ మధ్యతరగతివాడి కథ."

జ్ఞానమూర్తి మాట్లాడుతున్నాడు. అతని మనసులోపల జీవ నాటకం దృశ్యాలు కదిలిపోతున్నాయి ఒకదాని వెంట మరొకటిగా.

"ఒరేయ్ జ్ఞానీ! పడమటి వేపు పల్లంలో సంగలు. గాబ తెగ పెరిగిపోతున్నాయ్‌రా. కూలీల్ని పెట్టి రేపు పీకించే ఏర్పాటు చూడు!" పెద్దయ్య అధికార కంఠంతో అంటున్నాడు.

'నువు రేపు ఊళ్ళోఉండవా అన్నయ్యా!'

"లేదురా. ఎన్నాళ్ళ నుంచో దుర్గ గుడికి వెళ్దాం అంటోంది మీ వదిన. చిన్న వాళ్ళిద్దరూ సినిమా సినిమా అంటూ గొడవ చేస్తున్నారు. ఉన్న పంచెల్లో రెండు కొర్రు పట్టాయి. అందుకని అన్ని పనులూ కలిసి వస్తాయ్ కదా అని. గూడు బండీ కట్టుకుని రేపు టౌనుకెళ్దాం అనుకుంటున్నాను".

మొదటి దృశ్యం కరిగిపోయింది. రెండో దృశ్యం మొదలైంది.

"అది కాదండీ! మీ అన్నయ్యగారికేమో ఊళ్ళో పెత్తందారీ పన్లు. మీకేమో

# జ్ఞానోదయం

కొండముది శ్రీరామచంద్రమూర్తి



పొలంలో మాత్రం గొడ్డు చాకిరీ. వాళ్ళ పిల్లలకేమో సినిమాలు. షికార్లూ, ఎగ్జిబిషన్లూ, అన్నీ కావాలి. కొత్తగా పెళ్ళి అయిని వాళ్ళం మనం. మనకు మాత్రం వంటింటి పొగే సాంబ్రాణి. గొడ్లపెంటే కర్పూరం. ఆయనగారి పెళ్ళానికి నెలకో కొత్త చీర కావాలి. నాకు మాత్రం మా పుట్టింటారే కొనిస్తుండాలి! బావుందండి వరస...."

తను అన్నయ్య దగ్గరకు వెళ్ళాడు. అడిగేశాడు భయం భయంగా.

"అన్నయ్యా! డబ్బు కావాలి!"

"ఎందుకూ?" ఎందుకో తను నోరు విడిచి ఎట్లా స్పష్టంగా చెప్పడం?— పెద్ద వాళ్ళతో! మళ్ళీ ఆయన అన్నాడు "ఒరేయ్ జ్ఞానీ! చెప్పేది జాగ్రత్తగా విను. జ్ఞానం కలవాడు డబ్బును ఖర్చుపెట్టడు. దాచుకుంటాడు. చక్కగా పొలంలో పనిచూసుకో. కష్టపడు. ఇంటికి రా. భోంచెయ్. విశ్రాంతి తీసుకో. మీ ఆవిడకు ఏం కావాలో మీ వదిన చూసుకుంటుంది. వీలయినంత వరకు కోరికల్ని అదుపులో పెట్టుకోండి. ఉన్నంతలో సంతృప్తిని పొందండి. అవసరాలంటావా, వాటి సంగతి నేను కనుక్కుంటాను. వాటి కోసమని డబ్బు వెంటపడకు. డబ్బు జబ్బు పట్టుకున్న తక్షణం, నిన్ను సంతోష పెడుతున్నట్టే కనిపించి: అది నిన్ను బానిసను చేస్తుంది."

మూడో దృశ్యంలో రకరకాల మనుష్యులు జ్ఞానమూర్తిని అతలాకుతలం చేస్తున్నారు. "ఏమయ్యా అల్లుడూ! పెళ్ళయి మూడేళ్ళయింది. అమ్మాయి మెడలోకి ఒక్క బంగారు నగకూడా చేయించలేక పోయావేమిటోయ్? పైగా వ్యవసాయంమీద పెత్తనం అంతా నీదేనటకదా?" పిల్లనిచ్చిన మామగారి చురక.

"ఏవిటోయ్. ఈ డ్రెస్సేవిటీ- నువ్వేమిటీ? నువ్వేమన్నా మీ ఇంటి పెద్ద పాలేరువా? కాస్త ఫాషనబుల్‌గా ఉండడం నేర్చుకోరాదూ?" చిన్నప్పుడు తనతో కలిసి చదువుకుని-కలెక్టరవుదామనుకుని బిల్లుకలెక్టరుగా స్థిరపడ్డ స్నేహితుడి మందలింపు.

"ఏవండీ- ఇది విన్నారా? మా పద్మావత్తక్కయ్యలేదూ-దానిమొగుడు పల్లెటూళ్ళో వుండలేక ఉన్న కాస్తపొలమూ అమ్మేసి పట్నంవెళ్ళి ఎరువుల కంపెనీ పెట్టాట్ట. పెట్టి ఇంకా రెండేళ్ళన్నా కాలేదు. అప్పుడే రెండంతస్థుల బిల్డింగు కొనేసుకున్నాట్ట. మనమూ పట్నం వెళ్ళిపోదామండీ!" భార్య శ్రీలక్ష్మి చెవిలో పోరు.

"ఒరేయ్ జ్ఞానీ? ప్రతీ ఆదివారం సంతకెళ్ళి సరుకులు నువ్వే తీసుకురావాల్రా అబ్బీ!" అన్నయ్య సుగ్రీవాజ్ఞ.

"సరుకులుతెచ్చేటప్పుడే కాస్త కమీషను మిగల్చండి!" శ్రీలక్ష్మి సలహా.

"పట్నంలో తిరిగేటప్పుడైనా కాస్త నాజూగ్గా కనబడరా నాయనా!" స్నేహితుడి అభ్యర్థన.

"నాజూకులూ వద్దు. బండలూ వద్దు. మన హద్దుల్లో మనం ఉండాలి. అది మర్చిపోకు!" అన్నగారి మందలింపు.

"గాదెకింద పందికొక్కులా మీరుఉండలేరుగానీండి. వారంలో ఒకరోజు పట్నంలో ఉండే అవకాశం వచ్చిందికదా. అక్కడ బ్రాకెట్లే ఆడుతారో. వ్యాపారమే చేస్తారో

## 'కిన్నెర' నాటిక పోటీలు

హైదరాబాద్‌కు చెందిన కిన్నెర ఆర్ట్ థియేటర్స్ డిసెంబరు 24, 25 తేదీలలో నిర్వహించనున్న తృతీయ అఖిల భారత స్థాయి నాటిక పోటీలలో గెలుపొందిన రచనలకు, ప్రదర్శనలకు కలిపి రు. 3,000కు పైగా నగదు బహుమతులు వుంటాయి. వివరాలకు సంస్థ కార్యదర్శి పేరిట 2—2—647/153, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, హైదరాబాదుకు వ్రాయవచ్చు.

## చైతన్య సాహితీ సమాఖ్య

ఆచార్య దివాకర్ల వెంకటావధాని శ్రీకృష్ణ జయంతి నాడు హైదరాబాదులోని అశోక్‌నగర్ కేంద్ర గ్రంథాలయంలో "చైతన్య సాహితీ సమాఖ్య"కు ప్రారంభోత్సవం చేశారు. సమాఖ్య అధ్యక్షులు శ్రీ రాఘవరావు స్వాగతం పలికారు.

# సమాహారము

ప్రధాన కార్యదర్శి సీతారామచంద్ర సంస్థ ఆశయ కార్యక్రమాలను వివరించారు. శ్రీ హరిశ్చంద్ర ప్రసాద్ రచించిన "సాహిత్యవ్యాసాలు" గ్రంథాన్ని డాక్టర్ పి. నారాయణరెడ్డి ఆవిష్కరించారు. డాక్టర్ ముకురాల రామారెడ్డి పుస్తక పరిచయం చేశారు. శ్రీ కె. వి. భాస్కరరావు కృతిని స్వీకరించారు. కవి సమ్మేళనంతో నాటి సభ ముగిసింది.

## సింహపురి సాహితీ సమాఖ్య

నెల్లూరుకు చెందిన యీ సంస్థ దీపావళి సందర్భంగా నిర్వహిస్తున్న మినీ కవితల పోటీలో పాల్గొనదలచినవారు ప్రధాన కార్యదర్శి, సింహపురి సాహితీ సమాఖ్య, 10 170, సంతపేట, నెల్లూరు (3-4001) నుంచి వివరాలను పొందవచ్చు.

## వెంకట్ అవార్డు కార్టూన్ల పోటీ

సాధన సమితి ( హైదరాబాదు ) నిర్వహిస్తున్న వ్యంగ్య చిత్ర లేఖనంలో 5వ వార్షిక పోటీకి ముగింపు తేదీ అక్టోబరు 16. వివరాలకు-కార్యదర్శి, సాధన సమితి, 1-1336/20, వివేక్ నగర్, చిక్కడపల్లి, హైదరాబాదు-20.

---

ఇంటికి తిరిగొచ్చేటప్పుడు మాత్రం నాలుగు రాళ్ళు తీసుకురావడం మర్చిపోకండి!" శ్రీలక్ష్మి అర్థింపు.

"కష్టపడ్డవాళ్ళకు నాలుగురాళ్ళు మిగలవు గాక మిగలవు. మీ ఆవిడ బ్రాకెట్టాడమంది కదా. కనీసం చీట్లాటైనా నేర్చుకో. చెయ్యి కలిస్తే చెట్టంతెత్తు కెదగొచ్చు!"

"అమ్మో పేకాటే!"

"ఏం ఇదేం దొంగతనం కాదు. లంజరికం కాదు. అదృష్టానికి సవాల్! నీ డబ్బులు పెట్టుకు సువ్వాడుతావు. వస్తే నువ్వూ నీవాళ్ళు సుఖపడతారు. పోతే. నీకు తప్ప మరొహరికి బాధలేదు!" గీతోపదేశంతో చివరి దృశ్యం ముగిసింది. అప్పటికి జ్ఞానమూర్తి ఓ బ్యాంకు గెల్చుకోవడం కూడా పూర్తయింది. లేచి నిలబడ్డాడు.

"కూర్చో గురూ! మరో బ్యాంకు ఆడదాం?" సత్యానంద్ అడిగాడు.

"టేబిల్ ఎత్తేయ్! మనవాడితో కలిసి ఇవాళ నేనూ బయటకు వెళ్తున్నా!" నరేంద్రనాథ్ తానూ లేస్తూ అన్నాడు.

"ఇవ్వాళ మా ఆవిడ తొందరగా రమ్మంది ఇంటికి!" గున్నయ్యచెట్టి తానూ లేచి నిలబడ్డాడు.

మునిసిపాలిటీ వారి మురుగు కాల్వమీద నుండి మురిగిపోయిన వాసన నల్దిసలా వ్యాపిస్తోంది. ఆ వాసనను భరించలేక దోమలు కూడా కుయ్యో మొర్రోమంటూ ఏడుస్తున్నాయి. రోడ్డు మీద గతుకుల్లో నిల్చిన నీళ్ళల్లో చంద్రుడు ముక్కలవుతున్నాడు. గతుకులరోడ్డును పెద్దగాపట్టించుకోకుండా, దోమలను లెక్కచెయ్యకుండా, మురుగువాసనకు ముక్కు మూసుకోకుండా సత్యానంద్, నరేంద్రనాథ్, జ్ఞానమూర్తి ఆ రాత్రి పదిగంటల వేళ క్లబ్బు నుండి బయటపడి మాట్లాడుకుంటూ నడుస్తూ పోతున్నారు. ఇద్దరేమో తమ ఇళ్ళకు. ఒకడు లాడ్జికి.

"ఏం సంపాయించినా నలభై ఏళ్ళలోపే సంపాయించాలి.నీ కిప్పుడే ముప్పై నిండాయనుకుంటాను" అన్నాడు నరేంద్రనాథ్ ఉపోద్ఘాతంగా.

"నీవంటూ నీకు కొంత విల్వ వుండాలి. మొదటి వెయ్యీ సంపాయించు. తర్వాత అదే పిల్లల్ని పెడుతుంది!" సత్యానంద్ వంతపలికాడు నరేంద్రనాథ్ మాటలకు.

"డబ్బు వుంటేనే జీవితంలో నువ్వు సుఖపడేది డబ్బు వుంటేనే నీ భార్య నిన్ను గౌరవించేది. డబ్బున్న అల్లుడేనే మామగారు సరిగా చూసేది! ఇది తెలుసు కాబట్టే మీ అన్నగారు తాళం చెవులు తన దగ్గర పెట్టుకున్నాడు. వెట్టిచాకిరీ నీచేత చేయిస్తున్నాడు!"

"ఇహమీదట చెయ్యకూడదని నిశ్చయించుకున్నాను!" జ్ఞానమూర్తి కంఠంలో ఒక దృఢనిశ్చయం.

"అది ఒకటే చాలదు. ముందుగా ఓ వెయ్యిరూపాయలుఅడుగు. ఆవెయ్యిరూపాయలకు పిల్లలెన్నెట్టాపుట్టిస్తామో చూడు!"

"అట్లాగే!"

జ్ఞానమూర్తి అకస్మాత్తుగా వెయ్యి రూపాయలు అడగడం చూసి. పెద్దయ్య ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేశాడు "అంత డబ్బు ఇప్పుడెందుకురా జ్ఞానీ?"

"కారణం చెప్పాలా?"

"అంత అవసరం, నాకు తెలియని అవసరం, ఇప్పుడేమొచ్చిందని?"

"వ్యాపారం చేద్దామనుకుంటున్నాను!"

"వ్యవసాయం అంటే భూమితల్లిని నమ్ముకోవడం. వ్యాపారం అంటే సాని దాని షోకులకు మోసపోవడం!"

"ఈ వెట్టి చాకిరీ నేను చెయ్యలేను. ఈ గొర్రెతోక బతుకు నేను బతకలేను. నాకు వ్యాపారం చేద్దామని వుంది — పెద్దవాణ్ని కావాలని వుంది. అందుకు డబ్బు కావాలి!"

"డబ్బీయకపోతే....?"

"నా వాటా నాకు పంచిపెట్టండి. దాన్ని డబ్బుగా మార్చుకుంటాను!"

పెద్దయ్యకు ఆ మాట విని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "అంతమాటనకురా!" అంటూ అయిష్టంగానే వెయ్యి రూపాయలూ పెట్టెలోంచి తీసి ఇచ్చాడు.

ఆ వెయ్యి రూపాయలూ తీసుకుని జ్ఞానమూర్తి, నరేంద్రనాథ్ దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చాడు. "ఇదిగో నువ్వడిగిన డబ్బు. ఇప్పుడు పిల్లల్ని పెట్టించు!"

"దానికైనా యోగం వుండాలిరా నాన్నా!" సత్యానంద్ పుల్లవిరుపుగా అన్నాడు.

"ఆ యోగం వుందో లేదో, మీ గురువుగారి దగ్గరకు ఇతణ్ని తీసుకుని వెళ్ళి కనుక్కుంటే...."

"బాగానే వుంటుంది." నరేంద్రనాథ్ మాటలకు సత్యానంద్ తలూపాడు.

ముగ్గురూ కలిసి నాడీ జాతకాలు చూసే పండిత పరమేశ్వరశాస్త్రి దగ్గరకు వెళ్ళారు.

"ఆయన దగ్గర వున్నది కేరళనాడి. అందులో నీ పేరు, వూరూ చూసి నువ్వు దంగై పోతావు!" సత్యానంద్ కంఠంలో తన గురువుగారి గొప్పదనం గురించిన గర్వం తొణికిస లాడింది. గురువుగారు పూజలో ఉన్నారని వాళ్ళను ముందుగదిలో

కూచోబెట్టారు ఆ ఇంటివాళ్ళు.లోపల అమ్మవారి ముందు పద్మాసనం వేసుకుని కూచుని ఉన్నాడు పరమేశ్వరశాస్త్రి. నొసట విబూతి రేఖలు. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. చేతులెత్తినపుడల్లా కరకంకణాలు ఘల్లుమంటున్నాయి. పెద్ద బొజ్జ. బొజ్జకు వక్షస్సుకు మధ్య ఉన్న గుంటలో కుంకుమబొట్టు. పట్టు సీతాంబరంలో పండినజుత్తులో.దండకు చుట్టిన నల్లని తాయెత్తులో. పండిన పెద పుల్లో. వేళ్ళకు పెట్టుకున్న దశావతారాల ఉంగరాల్లో ఆయన విలక్షణంగా ఉన్నాడు. భయంగా వున్నాడు. తాంత్రిక వృక్షం పూచిన రక్తవర్ణ పుష్పంలా ఉన్నాడు.

ఆయనకు అతి దగ్గరగా గున్నయ్యచెట్టి కూచుని ఉన్నాడు. గున్నయ్యచెట్టి అరచేతిలో రెండు వంద రూపాయలనోట్లు ఉన్నాయి.

"అవి చాలవురా. చెట్టీ!" అన్నాడు పండితశాస్త్రి బొంగురు కంఠంతో.

"వివరాలన్నీ చెప్పాను. అవి చిలక పలుకుల్లాగా పలకడానికి ఈ డబ్బు చాలు" అన్నాడు చెట్టి ధూర్తస్వరంలో.

"నీ పథకం పారితే ఎన్నో వేలు లాభం నీకు!"

"అప్పుడు మరో నూటపదార్లిచ్చుకుంటాంలెండి!"

"అయితే వాళ్ళను పంపించు!"

చెట్టి పక్కకు తప్పుకున్నాడు. గంట మోగింది.ముగ్గురూ లోపలకు అడుగెట్టారు. సత్యానంద్. నరేంద్రనాథ్. కళ్ళతోనే పండితశాస్త్రిని ముందుగా పలకరించారు. సాష్టాంగ దండప్రణామం చేశారు. జ్ఞానమూర్తిచేత చేయించారు.

జ్ఞానమూర్తిని చూడగానే "నువ్వగదూ నాడీ జాతకం కోసం వచ్చిందీ? తెలుస్తోందిలే నీ పేరు ఫలానా.. అవునా? . నీ తండ్రి పేరుఇదిగో-ఇక్కడుంది!! ఫలానా ఊళ్ళో పుట్టావుకదూ? ఇదిగో ఇక్కడుంది నీ జాతకఫలం! సరిగ్గా నీకు ముప్పై దాటి ముపై ఒకటి వచ్చేసరికల్లా నీదశే మారిపోతుంది. ఎంతోడబ్బు కళ్ళ జూస్తావు. నీ చేతుల్లో నుంచి డబ్బు నీళ్ళలా ప్రవహిస్తుంది!"

"ఇంకా వివరాలు చెప్పండి గురూజీ!" జ్ఞానమూర్తి అతనిముందు తాంబూలంలో నూటపదార్లు పెట్టి. రెండు చేతులూ కట్టుకుని అడిగాడు.

"ఈ నూట పదార్లలో వంద రూపాయలు నువ్వు పేకాటలో గెలిచిన డబ్బు!"

పరమేశ్వరశాస్త్రి శక్తిచూసి జ్ఞానమూర్తికి నోటమాట రాలేదు. "ఇంటినుంచి తెచ్చిన డబ్బును తొలివిడతగా పేకాట చోటనే ఖర్చుపెట్టు. దాని ఫలితం గమనించు!"

గురూజీ చెప్పినట్టే చేస్తానని పట్టు పట్టాడు జ్ఞానమూర్తి.

"అయితే ఒక పని చెయ్. పేకాటలో ఖర్చు పెట్టకు-టేబిల్సు దగ్గర బ్యాంకులయిపోయినవాళ్ళకు టెంపరరీగా అప్పులు పెట్టు. గంటకు నూటికి పది రూపాయలు వడ్డీ వసూలు చెయ్. వాళ్ళ వాచీలో. ఉంగరాలో తాకట్టుపెట్టుకో. అసలు ప్లస్ వడ్డీ నీకు జమరాగానే వాళ్ళ వస్తువులు వాళ్ళకు తెల్లారేసరికి తిరిగి ఇచ్చేసెయ్!"

వాళ్ళ సలహా అమలులో పెట్టి ఆ ఒక్క రాత్రీ వెయ్యి రూపాయలు అసలు అసలుగా ఉంచుకుని నాలుగు వందలు పైనే సంపాదించగలిగాడు జ్ఞానమూర్తి. ఆ సంతోషంలో తనస్నేహితులు ముగ్గురికీ మర్నాటి ఉదయం ఓ త్రీస్టార్ హోటలులో పార్టీ చేశాడు.

పెసరట్టూ ఉప్మా అల్లం పచ్చడి కాంబినేషన్‌లో తింటూ సత్యానంద్ అన్నాడు

"కలిసొచ్చేకాలానికి నడిచొచ్చే కొడుకు పుడతాడని సామెత. నీ స్టార్ ఇప్పుడు రెయిజింగ్‌లో వుంది. ఒక పని చెయ్ గలవా?"

"ఏం చెయ్యాలో చెప్పు గురూ—నువ్వు చెప్పడం. నేను చేసేయడం అంతే! మంచి ఉత్సాహంతో వున్నాడు జ్ఞానమూర్తి. ఊపులో అన్నాడు ఆ మాట.

"మేం ముగ్గురం తెలుగునాడు ఇండస్ట్రీస్ అని వో కంపెనీ పెట్టాం. నువ్వూ అందులో షేర్లు తీసుకోరాదూ? వచ్చే సంవత్సరానికే డివిడెండ్ పంచిపెట్టాలని మా ప్రయత్నం. అయినవాడివికదా. నువ్వూ బాగుపడాలన్నది మా వుద్దేశ్యం- ఆ తర్వాత నీ యిష్టం!" గున్నయ్యచెట్టి చాలా జాగ్రత్తగా ఆచితూచి మాట్లాడాడు.

"ఎంత కావాల్సివస్తుంది డబ్బు?"

"నలభై వేలయితే డైరెక్టరు కావచ్చు!"

"నలభై వేలేం ఖర్మ. యాభై వేలు కావాల్సినా నిముషంలో తెస్తా!" జ్ఞానమూర్తి మహోత్సాహంలో ఇంటికి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయిన తర్వాత నరేంద్రనాథ్ అన్నాడు—మిగిలిన ఇద్దరితో "ఫ్రెండ్స్: అతను తెచ్చే దాంట్లో నాకు ఫిఫ్టీ పర్సెంట్ అయినా కావాలి!"

"అయితే మా ఇద్దరికీ చెరో వన్‌ఫోర్తు షేర్ అన్నమాట! అన్యాయం బ్రదర్!!" గున్నయ్య చెట్టి గునిశాడు.

"షేర్ల సంగతి తరవాత.ముందు వాణ్ణి డబ్బు తేనీండి!" సత్యానంద్ వివాదాన్ని సర్దుబాటు చేశాడు.


తన వెయ్యి రూపాయలూ తెచ్చి తనకిచ్చేసిన తమ్ముణ్ణి చూసి మెచ్చుదలగా అన్నాడు పెద్దయ్య.

"పాడు జేస్తావనుకున్నానురా. ప్రయోజకుడవైనావు. నాకు చాలా సంతోషంగా వుంది:"

"నీ అసలు నీకు ఇచ్చేస్తానన్నాను ఇచ్చేశాను. ఇప్పుడు దానిమీద వచ్చిన లాభం ఇదిగో! నీ వాటా" అంటూ రెండు వందలు ఆయన చేతిలో పెట్టాడు జ్ఞానమూర్తి.

"ఒక్క రాత్రికి నాలుగు వందలా నీకు లాభం? ఏం వ్యాపారం రా అది?" ఆశ్చర్యంతో అడిగాడు పెద్దయ్య.

"నా వ్యాపారం సంగతి నీకెందుకు గాని అన్నయ్యా! ఇప్పుడు చూశావుగదా నా



ప్రయోజకత్వం? నీ వ్యవసాయం నీది. నాకా వ్యవసాయం వద్దు. నా వ్యాపారం నాది. నా వ్యాపారం నీకు వద్దు. అంచేత వాటాలు పంచేసెయ్. నేను పట్నం వెళ్ళిపోయి నా బ్రతుకేదో నేను బ్రతుకుతా!"

ఈసారి ఏమనడానికీ పెద్దయ్యకు నోరు రాలేదు. "వెళ్తాను. వెళ్తాను అనే వాణ్ణి ఎందుకూ ఆపడం?" అన్నదాయన భార్య వరుషంగా.

"అవును. వెళ్తాం. బాగుపడతాం!" అన్నది శ్రీలక్ష్మి ధీమాగా.

"సరే- ఆస్తి పంపకాలు ఎందుగ్గానీ. నీ వాటాకు ఎంత డబ్బు కావాలో చెప్పు! మీ వదిన వొంటిమీదున్న బంగారం తీసుకు వెళ్ళు పొలానికి ప్రత్యామ్నాయంగా!" అన్నాడు పెద్దయ్య బాధగా.

నిమిషంలో బంగారం డబ్బుగా రూపం మార్చుకుంది. ఆ డబ్బు షేర్లుగా మారింది. తెలుగుదేశం ఇండస్ట్రీస్ అంటూ బోర్డున్న బిల్డింగులోకి కార్లూ, లారీలూ రావడం పోవడం ఎక్కువైంది. "డైరెక్టరుగారు.... డైరెక్టరుగారు!" అంటూ జ్ఞానమూర్తికి అందరూ నమస్కారాలు చేయడం మొదలు పెట్టారు. నమస్కారాల మైకంలో వంత కాల సంగతే మర్చిపోయాడు జ్ఞానమూర్తి. ఒకరోజున ప్లేయర్స్ హాలు యజమానే స్వయంగా అతని దగ్గరకు వచ్చాడు.

"మీకు అభ్యంతరం లేకపోతే మీ షేర్లు నేను కొనుక్కుంటాను. ఇరవై అయిదు శాతం లాభానికి వాటిని మీరు అమ్మగలరా?"

షేర్ల ధర పెరిగిందనగానే జ్ఞానమూర్తి సంతోషానికి అవధి లేకుండాపోయింది. మిత్రత్రయం దగ్గరకు వెళ్ళి ఆ సంగతి చెప్పాడు. "అమ్మేయమంటారా?"

"వద్దు వద్దు" వాళ్ళు కళవళ పడ్డారు. "ఇంకా ధర పలుకుతుంది. ఈ వ్యాపారం నచ్చకపోతే, అప్పుడు ఆలోచిద్దువుగాని అమ్మే సంగతి!" జ్ఞానమూర్తిని అవతలకు పంపించేసి ముగ్గురూ ఒకరివేపు ఒకరు చూసుకున్నారు.

"వాడెందుకు కొంటానన్నాట్ట ఆ షేర్లు?" నరేంద్రనాధ్ అడిగాడు [illegible]ంగా.

"మనం ముగ్గురం వాడికీ బాకీ ఉన్నాం గదా? ముందు వాడి షేర్లు కొనేసి డైరెక్టరైపోయి, అటు కంపెనీ పరంగాను, ఇటు బయటా మనమీద వొత్తిడి తీసుకు వచ్చి కంపెనీని స్వంతం చేసుకుందామని అయి వుంటుంది వాడి ప్లాను!"

"వాడే డైరెక్టరయితే, షేర్ల పేరు చెప్పి [illegible] జ్ఞానమూర్తిని చేసిన మోసం నిమిషంలో బయటపడుతుంది." గున్నయ్యచెట్టి మొహంమీద చెమటపట్టింది.

"అయితే ఇప్పుడేంచెయ్యడం?" సత్యానంద్ ప్రశ్న.

"షేర్లులేదూ, గాడిదగుడ్డులేదు. మొత్తం బిజినెస్ వైండప్ చేయించేద్దాం! బోర్డు మార్పించేద్దాం! ఐపీ పెట్టేద్దాం" నరేంద్రనాథ్ సలహా చెప్పాడు

"మన పీకల మీదకు ఏమీ రాదుకదా?" చెట్టి కంఠం వణికింది.

"మనకున్న ఆస్తిపాస్తులు మన వంటి మీద ఈ బట్టలేకదా! దోంట్ ఫియర్! బాకీలవాళ్ళకు జ్ఞానమూర్తి ఆస్తి వుందిగా దానిమీదకు పోతారు! మనం సేఫ్!"

కంపెనీ లిక్విడేషనుకు వాళ్ళ ప్రయత్నాలు వాళ్ళు రహస్యంగా చేస్తున్న సమయంలోనే పెద్దయ్య జ్ఞానమూర్తి దగ్గరకు వచ్చి "తమ్ముడూ, మీ వొదిన తన వంటి మీద నగలువొల్చి ఇచ్చినప్పట్నించీ,ఆస్తి పోయింది, నగలూ పోయినయ్ అని ఒకటే ఇదై పోతోందిరా. ఇంట్లో శాంతే కరువైపోయింది.నువ్వేం అనుకోకపోతే నీ వాటా నాకు దఖలు పర్చేసెయ్! ఆ కాయితాలు దాని మొహాన కొడ్తేనన్నా ఆ కన్నీళ్ళు ఆగుతయ్యేమో!" అన్నాడు తల వొంచుకుని.

"ఆరోజే చెప్పాను కదన్నయ్యా తీసేసుకోమని. నువ్వే వద్దన్నావ్!" అన్నాడు జ్ఞానమూర్తి పెద్దయ్య తెలివితక్కువను ఎత్తి చూపుతున్నట్టుగా. పెద్దయ్య అడిగి


40 సంవత్సరముల నుండి ప్రఖ్యాతిగాంచిన ఆయుర్వేద వనమూలికల మిశ్రమము



ఆర్యన్
కళ్యాణి
ఆయుర్వేదిక్
యూటరిన్ టానిక్

Manufactured by:
ARYAN DRUG COMPANY,
TANUKU (W.G.Dt)., A.P.

స్త్రీలగర్భాశయ వ్యాధులు అనగా

1 స్త్రీల ఋతుక్రమము (బహిష్టు) లో నొప్పి.
2 ఋతుక్రమము, క్రమము (హెచ్చుతగ్గులు) తప్పివచ్చుట.
3 సంతానములేనివారు గర్భములు నిలవనివారు.
4 సంతానము ఉండి ఆపరేషన్ చేయించుకున్న తరువాత ఋతుక్రమములో హెచ్చుతగ్గులు. ఎక్కువ ఋతుస్రావము (తెలుపు, ఎరుపు)
5 ఋతుస్రావములో (తెలుపు, ఎరుపు, నలుపు) జరుగుటవలన నీరసము. నడుమునొప్పి, కాళ్ళుచేతులు నొప్పులు.
6 గర్భవాతముచే ధృఢ శరీరము తలనొప్పి, చెవులోహోరు. గుండెదడ. నరముల బలహీనత, హిస్టీరియా,
7 ఆరోగ్య, అనారోగ్య; పరిస్థితులలో కూడా స్త్రీలు కళ్యాణిని వాడవచ్చును.

• అన్ని మందుల షాపుల్లోను దొరుకును.

KARTIKA•KRIPU

అన్ని ముఖ్య పట్టణములలో స్టాకిస్టులు కావలెను.

నట్టుగానే తన వాటా ఆస్తిని ఆయనకు రాత కోతలతో దఖలు పర్చేశాడు.

ఆ ఆస్తి అటు పోయింది. ఇటు కంపెనీ మూతపడింది. అప్పులవాళ్ళు అతని చుట్టూ మూగడం మొదలెట్టారు. నరేంద్రనాథ్ కోసం ప్రయత్నిస్తే అతని జాడ కనిపించ లేదు. సత్యానంద్ ఇలు తాళం వేసి వుంది. గున్నయ్యచెట్టి తీర్థయాత్రలకు వెళ్ళినట్టు తెలిసింది. మోసపోయిన జ్ఞానమూర్తి హృదయం భగ్గుమంది. ముందుగా పండిత పరమేశ్వరశాస్త్రి దగ్గరకు వెళ్ళాడు. "నేనేం చెప్పాన్రా నీకు? నీ దశే మారిపోతుంది. ఎంతో డబ్బు కళ్ళ జూస్తావు. నీ చేతుల్లో నుంచి డబ్బు నీళ్ళలా ప్రవహిస్తుంది అన్నాను కదూ. అట్లాగే జరగలేదూ—ఓరి వెర్రినాగన్నా! ఈ లోకంలో చిన్న చేపను పెద్దచేప మింగుతుంది. అమాయకుల్ని తెలివిగలవాడు మోసగిస్తాడు. డబ్బు కోసం ఎవడిప్రయత్నం వాడు చేస్తాడు. ఆ వేటలో పరుగు పందెంలో. ఎవడి విజయం వాడిది. ఎవడి పతనం వాడిది. ఈ మనీ కల్చర్‌లో అయ్యో అన్నమాటకే ఆస్కారం లేదు. వెళ్ళు.... వెళ్ళు....!"

ఆ మాటలతో మాడు బొప్పికట్టినట్ట యింది జ్ఞానమూర్తికి. జవాబు చెప్పలేక. దిగాలుపడ్డ మొహంతో ఇంటికి తిరిగి వచ్చాడు. లోపలికి వచ్చిన జ్ఞానమూర్తికి ఏడుస్తున్న శ్రీలక్ష్మి. ఆమెను ఓదారుస్తున్న పెద్దయ్యా కనిపించారు. "ఊరుకో తల్లీ! ఊరుకో! మనవాణ్ణి మోసం చేస్తున్నారని కర్ణాకర్ణిగా వినే ఆ పొలం నా పేరు మీద రాయించేసుకున్నాను. అదే మిగిలింది ఇప్పుడు మనకు!! నీ మొగుడితో చెప్పమ్మా ఇదివరకు లాగానే వాణ్ణి పొలంమీదనే బతకమని!! వ్యవసాయం చేసుకునేవాడు ఆ తల్లిని కాదని. వ్యాపారం షోకులకుపోతే ఆ భూదేవికి కోపం వస్తుందని. అది మనకు మంచిది కాదనీ స్పష్టంగా చెప్పు!"

తల వంచుకుని పెద్దయ్య దగ్గరకు వచ్చి అన్నాడు జ్ఞానమూర్తి— "నిజమే అన్నయ్యా! కన్నతల్లిని కాదన్నవాణ్ణి మరే సవతల్లీ ముద్దు పెట్టుకోదు! డబ్బు కోసం పరుగులు తీస్తే బోర్లాపడడం తప్పదు !!!"

పెద్దయ్య నవ్వాడు అర్థవంతంగా. తమ్ముణ్ణి ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు. ●

వివాహములయందు పట్టు చీరెలె ముందు!
కంచిపట్టు మరియు ఫ్యాన్సీ చీరెలకు
బనారస్ శారీహౌస్
J.D. హాస్పిటల్ రోడ్, గవర్నరు పేట, విజయవాడ-520002.
PHONE: 61139

EXCLUSIVE IN PURE SILK SAREES & PAVADAS
BENARAS Saree House

విడుదల సెప్టెంబర్ 24!
పాఠక 'హృదయ వికాసానికి వెలుగు!

కలలు నిజమవుతాయా? కలల్లో కనిపించిన సంఘటనలు నిత్యజీవితంలో సంభవిస్తే..... వాటి పర్యవసానం ఏమిటి? స్వప్న చారిక - అతీంద్రియ శక్తులకీ మధ్య సాగిన భీషణ సమరం.
డా. ముదిగొండ శివప్రసాద్ హారర్ థ్రిల్లర్
స్వప్న కిరీటం
ఆంధ్రప్రభ వారపత్రిక సీరియల్
రూ. 20/-

మనిషిని చంపాలని పాము, పాముని చంపాలని మనిషి, ఒకరిపై మరొకరు పగబట్టి ఒకరికోసం మరొకరు వేటసాగిస్తే పాము గెలుస్తుందా? మనిషి జయిస్తాడా? పగతో రగిలిన పాము-మనిషి మధ్య భీకర పోరాటం. క్షణక్షణం గుండె ఝల్లుమనిపించే
లల్లాదేవి డైరెక్ట్ నవల
రుద్రనాగు రూ. 20/-

అమ్మాయి వెంట అబ్బాయి పడితే షరా మామూలే. అమ్మాయి అబ్బాయి వెంట పడితేనే థ్రిల్.
గిరిజ శ్రీభగవాన్
అమ్మాయిగారి ప్రేమయాత్ర
రూ. 15/-

రెండు విభిన్న మనస్సుల కలయికతో ప్రేమ ఉద్భవిస్తే... ఆ ప్రేమను దక్కించుకోడానికి ఆ జంట - లోకాన్నే ఎదిరిస్తుంది. ఆ ప్రేమ పోరాటానికి ముగింపేమిటి?
కె. కమలలత డైరెక్ట్ నవల
ప్రేమ పోరాటం
రూ. 16/-

కోడలు గొప్పా? కూతురు గొప్పా? ఎవరు ఎక్కువో తేల్చుకోడానికి కోడళ్ళూ - కూతుళ్ళూ అడుగడుగున పోటీపడితే....?
కానిరెడ్డి సీతాదేవి
కోడళ్ళూ - కూతుళ్ళూ
వనితాజ్యోతి సీరియల్
రూ. 16/-

శ్రీ శ్రీనివాస పబ్లిషింగ్ హౌస్
ఎ.టి. అగ్రహారం గుంటూరు - 522 004